క్లుప్తంగా

రెండు రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి, బూరేపల్లి, గార్లపాడు, ఘడియపూడి పునరావాస కాలనీల్లో రెండు రోజుల పాటు ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. విద్యుత్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

ఘనంగా బక్రీద్

మద్దిపాడు: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మౌలానాలు ఖురాన్‌లోని మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు తెలుపుతూ శాంతి, సమైక్యత, సహోదర భావాలు కలిగి జీవించాలని పిలుపునిచ్చారు. ముస్లింలు పలువురు తమ స్నేహితులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు.

మోడల్ స్కూల్ రోడ్డు పరిశీలన



మోడల్‌స్కూల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కనిగిరి రూరల్: స్థానిక గార్లపేట రోడ్డులో ఉన్న ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్) రోడ్డును ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ అధ్వాన్నంగా ఉన్న ఆదర్శ పాఠశాల రోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యగా మెటల్ రోడ్డును వేయాలని చెప్పారు. అలాగే మోడల్‌స్కూల్‌ను, వసతి గృహాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం శంఖవరం నుంచి గార్లపేట రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గోపిశెట్టి బాల చెన్నారావు, టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్కే ఫిరోజ్, ఎస్కే అహమ్మద్, ఎస్కే బారాయిమామ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు

● వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న అర్చకులు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీ క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం శుక్లపక్షం ఏకాదశి పండుగ పర్వదినం సందర్భంగా సోమవారం నగరంలోని పలు వైష్ణవాలయాల్లో స్వామివారి మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సామూహిక రమా వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డు ఐశ్వర్యనగర్లో గల మురళీకృష్ణ మందిరంలో, స్థానిక మస్తాన్ దర్గా సెంటర్లో ఉన్న గోకుల గోపాలకృష్ణ మందిరంలో, స్థానిక బాపూజీ గో సంఘంలో కృష్ణ మందిరంలో, సమతానగర్లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, రంగారాయుడు చెరువు వద్ద గల శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్లకు పాలు, పెరుగు, తేనె, చక్కెర, పన్నీరు, కొబ్బరినీళ్లు, వివిధ రకాల పండ్ల రసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ గావించి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. ఏకాదశి సందర్భంగా శ్రీ రమా వసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, మండపారాధన, కలశ పూజ, అభిషేకం, సత్యనారాయణస్వామి, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం రమా వసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రత కథలను భక్తులకు చక్కగా వివరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నగరాభివృద్ధి బాధ్యత తీసుకోవాలని ఎంపీ మాగుంటకు విజ్ఞప్తి



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు: ఒంగోలు నగరాభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని స్థానిక కర్నూలు రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం ఎంపీ మాగుంటను ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రం నిధులు పెద్ద మొత్తంలో తీసుకొచ్చి నగర అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చేరెడ్డి లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు, కోశాధికారి ఉన్నం వెంకటేశ్వరరావు, సభ్యులు కొల్లా మధు, అంజిరెడ్డి, కిరణ్‌కుమార్, సాగర్, నైనాల వేణుగోపాల్, అడపా జనార్దన్, వెరైటీ సప్లయిర్స్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బెల్లం కొండవారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తూర్పు గంగవరం గ్రామానికి చెందిన షేక్ యాసిన్ చిలకూరిపేటకు చెందిన తన స్నేహితుడు షేక్ సుభానీతో కలిసి సోమవారం ద్విచక్ర వాహనంపై దర్శికి బయల్దేరారు. మార్గంమధ్యలో దర్శి – చీమకుర్తి ప్రధాన రహదారిలో బెల్లం కొండవారిపాలెం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ వాహనంలో వారిని వైద్యశాలకు తరలించారు. మరో ద్విచక్ర వాహనం కూడా ఢీకొన్నా ఎటువంటి గాయాలు కాకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.



లారీ కింద ఇరుక్కుపోయిన ద్విచక్రవాహనం

విద్యార్థికి రంగశెట్టి ఫౌండేషన్ చేయూత

ఒంగోలు సెంట్రల్: ఆర్థిక లేమితో విద్యకు దూరం కాకూడదనే భావనతో శ్రీ కాళిదాసు సేవా సమితి పనిచేస్తోందని సమితి అధ్యక్షురాలు తీగల సత్యవతి అన్నారు. సమితి కార్యాలయంలో సోమవారం విద్యార్థి సాహితికి రంగిశెట్టి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రంగిశెట్టి సురేష్‌బాబు సహకారంతో రూ.15 వేల నగదు అందించారు. విద్యార్థికి సంవత్సరంలో చదువుకు అవసరమైన ఆర్థిక వనరులను తమ ఫౌండేషన్ సమకూరుస్తుందని సురేష్‌బాబు తెలిపారు. విద్యను మక్కువతో అభ్యసించి మంచి ఉన్నతి సాధించాలని సాహితిని దీవించారు. సత్యవతి మాట్లాడుతూ విద్యార్థి ఆర్థిక పరిస్థితి తెలపగా, స్పందించి అవసరమైన ఆర్థిక సహకారం అందించిన రంగిశెట్టి సురేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి శ్రీలక్ష్మి, తీగల కేదర్నాథ్, శ్రీనివాసరావు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న రంగశెట్టి ఫౌండేషన్ ప్రతినిధులు

ఆంజనేయా పాహిమాం



అలంకరణలో అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

● వేడుకగా పదహారు రోజుల ఉత్సవం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పదహారు రోజుల పండగ నిర్వహించారు. అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల జయజయధ్వానాల నడుమ ఏకాంత సేవ, పనాపు ఉత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. భజనల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దాతల సహకారంతో కాలువ పనులు

పుల్లలచెరువు: గ్రామంలోని కాటి వీరన్న చెరువుకు నీరు వచ్చే కాలువ పూడిపోయింది. దీంతో చెర్వులోకి వర్షం నీరు రావడం ఆగిపోయింది. ఈ చెరువు ఒక్కసారిగా నిండితే మూడేళ్ల పాటు గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండదు. వర్షాలు పడుతున్నా చెరువులోకి నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను గురించి స్థానికుడై హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న విద్యాదాత పోట్లపల్లి బాలకృష్ణ దృష్టికి గ్రామ పెద్దలైన కె.రఘు, కె. కుమార్, పి.ప్రసాద్, జి.భాస్కర్, డిష్‌చిన్నా తదితరులు తీసుకెళ్లారు. స్పందించిన బాలకృష్ణ తనకు తెలిసిన హైదరాబాద్‌లోని ఇంజినీర్లను పిలిచి కాలువను చెక్ చేసుకుని చెరువులోకి నీరు వచ్చే విధంగా ఎలా పనులు చేయాలో ప్రణాళికలు వేసి వెళ్లారు. బాలకృష్ణ ఆధ్వర్యంలో సమారు రూ.2 లక్షల ఖర్చుతో కాలువ పనులు సోమవారం చేపట్టారు. ఈ పనులు పూర్తి అయితే కాలువ ద్వారా కాటి వీరన్న చెర్వుకు సమృద్ధిగా నీరు చేరుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

చీమకుర్తి: స్థానిక ఎస్కేఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు అభయ సేవా ఫౌండేషన్ తరఫున సోమవారం నోట్ పుస్తకాలు అందించారు. ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా మద్దాళి పవన్ కుమార్ జ్ఞాపకార్థం ఫౌండేషన్ అధ్యక్షుడు మాధవరావు నోట్ పుస్తకాలు అందించారు. పరాంకుశం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, చిరంజీవి, స్థానికులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాధవరావు



కురిచేడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తాళ్లూరు: మల్కాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వైపాలెం ఈద్గాలో దువా చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

దొనకొండ: ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బీదలకు దానధర్మాలు చేశారు. ముస్లింలకు ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కురిచేడులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండగ సందర్భంగా మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకుని పేదలకు దాన ధర్మాలు చేశారు.

యర్రగొండపాలెం: ముస్లింలు బక్రీద్ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ముస్లింలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన వారు స్థానిక పెద్ద మసీదు వద్ద ఉన్న ఈద్గా వద్దకు చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌలానా హిదాయతుల్లా త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు.

త్రిపురాంతకం: బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్రిపురాంతకంతో పాటు మండలంలోని దూపాడు, మేడపి, వెల్లంపల్లి గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. పెద్ద సంఖ్యలో ఈద్గాల వద్దకు చేరుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెద్దదోర్నాల: బక్రీద్ పండగను పురస్కరించుకుని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు అల్లాహ్ అక్బర్ అంటూ తరలి వెళ్లారు. మౌలానాలు ఈద్ నమాజ్ చదివించి పుణ్యవచనాలు పలికారు. ఈ పవిత్ర దినాన్ని త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న ఈద్గా ముస్లిం సోదరులతో కిటకిటలాడింది. ఈద్గాల్లో కులమతాలకు అతీతంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండగను ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం, హిందువులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పుల్లలచెరువులో జరిగిన కార్యక్రమంలో ముజావర్ మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకగా పండుగను నిర్వహిస్తారని, అల్లా చెప్పినట్లు ప్రతి ఒక్కరూ ఇతరులపై దయ, ప్రేమ, జాలి గుణం కలిగి ఉండాలన్నారు.



వైపాలెంలో ఈద్గాలో మాట్లాడుతున్న మౌలానా హిదాయతుల్లా



పుల్లలచెరువు ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని మల్కాపురం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, రమణాలవారిపాలెం గ్రామాలలో సోమవారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ ప్రాధాన్యతను ముస్లింలకు వినిపించారు. ఇస్మాయిల్ ప్రవక్తల త్యాగనిరతిని ప్రతి ముస్లిం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మల్కాపురం సర్పంచ్ వలి, కో ఆప్షన్ సభ్యులు కరిముల్లా, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి సయ్యద్ లతీఫ్, ముస్లింలు పాల్గొన్నారు.

ముండ్లమూరు: ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవార భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పెద ఉల్లగల్లు, వేముల, ఉమామహేశ్వరపురం, ముండ్లమూరు, పులిపాడు, ఈదర, శంకరపురం గ్రామాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ పఠించారు. ఇస్లాం మత సూత్రాలను జీవితంలో కచ్చితంగా పాటించిన వారే మనుగడ సాధిస్తారని మత పెద్దలు తెలిపారు. ఈద్గా వద్ద ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధువులు, స్నేహితులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొని సంతోషంగా గడిపారు.



త్రిపురాంతకంలో..



దొనకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముండ్లమూరు: ఉమామహేశ్వరపురంలో..

మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి మృతికి బూచేపల్లి నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి తండ్రి, మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి మృతికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బొట్లపాలెంలో వారి నివాసంలో ఆయన తండ్రి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని బూచేపల్లి హామీ ఇచ్చారు.

వైభవంగా శ్రీనివాస కళ్యాణం



అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు



కళ్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు అనిల్ దంపతులు

పొదిలి: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణాచార్యులు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ ఉభయదాతలు వరికుంట్ల అనిల్‌కుమార్, లక్ష్మీ సురేఖ దంపతుల చేతుల మీదుగా విశేష అభిషేకాలు, కళ్యాణోత్సవం సాగాయి. అనంతరం భక్తులకు స్వామి వారి కళ్యాణ అక్షతలు, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రావణి వెంకటేశ్వర్లు, యక్కలి శేషగిరిరావు, సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, వెలిశెట్టి నారాయణ, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కరరావు, మేడా నరసింహారావు, సామి రాజా, మాజీ ఎంపీపీ వెలిశెట్టి విజయగౌరి, బొగ్గవరపు లక్ష్మి, కుమారి, రామాపురం కోటేశ్వరరావు పాల్గొన్నారు.